క్యాలెండర్ ఆవిష్కరణ

శంకర్‌పల్లి, జనవరి 28 : ప్రభుత్వం సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం టీపీయూఎస్ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలో జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జంగయ్య, శ్రీను, రాజేందర్, జంగయ్య, చంద్రశేఖర్, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, యాదయ్య, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

షాద్‌నగర్‌రూరల్, జనవరి 28 : ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఖాజా ఇద్రిస్ అహ్మద్ అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వినయ్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశాన్ని ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరుకానున్నందున గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

నిధులు కోసం మంత్రికి వినతి

మొయినాబాద్, జనవరి28 : హిమాయత్‌నగర్ గ్రామంలో ఉన్న ఎన్‌టీఆర్ కుటీరం నుంచి గండిపేట సర్కిల్ వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి దనుసరి సీతక్కకు హిమాయత్‌నగర్ సర్పంచ్ మంజుల వినతిపత్రం అందజేశారు. హిమాయత్‌నగర్ గ్రామంలో ఉన్న కుటీరం నుంచి గండిపేట సర్కిల్ వరకు ఉన్న 1.5 కిలో మీటరు దూరం ఉన్న రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా సర్పంచ్‌ల పదవి కాలాన్ని పొడిగించాలని మంత్రి సీతక్కను సర్పంచ్ చిలుకూరు సర్పంచ్ స్వరూప కోరింది. పదవి కాలం జనవరి 31తో ముగుస్తుందని గ్రామంలో కొన్ని పెండింగ్ పనులు ఉన్నాయని, వాటిని పూర్తి చేయాల్సి ఉందని వివరించారు.

గ్రామాల అభివృద్ధితోనే పురోగతి



షాద్‌నగర్‌రూరల్ : నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్, జనవరి 28 : గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రం మరింత పురోగతి సాధిస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండంలోని మెండోనిరాయి తండాలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని సర్పంచ్ సుగుణతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పల్లెలను శుభ్రంగా ఉంచుకోవడం గ్రామస్తుల బాధ్యత అన్నారు. సకాలంలో పన్నులు చెల్లిస్తే గ్రామాలను మరింత అభివృద్ధి పరుచుకోవచ్చన్నారు. అనంతరం తండావాసులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, ఉపసర్పంచ్ మంగ్యా నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు చల్లశ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బుజ్జీబాబూనాయిక్, రూప్లానాయక్, రవీనాయక్, ఎస్టీసెల్ నాయకులు శ్రీనునాయక్, సంజూనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, తేజ్యానాయక్, శ్రీనువాస్, దేశ్యానాయక్, వేణుగోపాల్, సూర్యనాయక్, దేశీయనాయక్, రమేశ్‌నాయక్, పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

నందిగామ : యువత క్రీడల్లోనూ రాణించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీటీసీలు చంద్రపాల్‌రెడ్డి, కృష్ణ, కుమారస్వామిగౌడ్, నాయకులు రాంరెడ్డి, నర్సింహ, బాబర్‌ఖాన్, పురుషోత్తంరెడ్డి, రాములు, శివకుమార్, జంగయ్య, యువకులు పాల్గొన్నారు.

నందిగామ : క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

దశలవారీగా పెండింగ్ పనుల పూర్తి

● ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం, జనవరి 28 : నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గడ్డమల్లాయగూడ, మల్కీజ్‌గూడ, తమ్మలోనిగూడ, మాల్ తదితర గ్రామాల్లో పర్యటించి భూగర్భ డ్రైనేజీ, సీసీరోడ్లు, డ్వాక్రా భవనం, బీసీ కమ్యూనిటీహాల్ తదితర అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను దశల వారీగా పూర్తి చేస్తానని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తుందని స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొప్పు సుకన్య, జడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు జంగయ్య, యాదమ్మ, సంతోష, కవిత, ఎంపీటీసీ లక్ష్మీపతిగౌడ్, వెంకటేశ్వర్లు, నర్సింహ, సురేందర్‌రెడ్డి, సుధాకర్, మహ్మద్‌గౌస్, శ్రీనివాస్, శేఖర్‌గౌడ్, రమేశ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో ధరణి సమస్యల పరిష్కారం

చేవెళ్లటౌన్, జనవరి 28: ధరణిసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులే మార్గమని చేవెళ్ల ఎంపీపీ విజయలక్ష్మీరమణారెడ్డి అన్నారు. ఆదివారం చేవెళ్లలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ధరణితో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులతోనే ధరణి సమస్యలు పరిష్కారం అవుతాయని సూచించారు. అధికారులు గ్రామ స్థాయిలోనే మండల అధికారులు నిర్ణయాలు తీసుకొని పరిష్కారం చేసేలా అధికారులకే అధికారం ఇవ్వాలని పేర్కొన్నారు. కమిటీలు అంటూ కాలయాపనలు చేసి సమస్యలను మరింతగా పెంచడం సరికాదన్నారు. భూమికి సంబంధం లేని వ్యక్తుల పేర్లపై రికార్డుల్లో రావటం, ఉన్న భూమి కంటే ఎక్కువ, తక్కువ భూమి నమోదు కావడం, పేర్లు తప్పులు రావటం వాటిని సరిచేసే ఆప్షన్ లేకపోవడం లాంటి ఎన్నో సమస్యలు ప్రజలు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. వీటిని త్వరగా పరిష్కరించే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

బీజేపీకి ప్రజలే బుద్ధి చెబుతారు

కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

యాచారం, జనవరి 28 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య అన్నారు. మండలంలోని ధర్మన్నగూడ గ్రామంలో ఆదివారం బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, అరాచకాలపై ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే నల్లదనాన్ని వెలికితీస్తామని గద్దెనెక్కిన బీజేపీ.., పేదలను విస్మరించి అదానీ, అంబానీలకు పెద్దపీట వేసిందన్నారు. ప్రజల ఖాతాల్లో 15 లక్షలు వేస్తానన్న మోదీ కనీసం పది రూపాయలు కూడా వేయలేదని ఎద్దేవా చేశారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులకు మొండి చేయి చూపించారని విమర్శించారు. ఉపాధి హామీ పథకం పనిదినాలను కుదించడం ఎంతవరకు సమంజసమన్నారు. గ్యాస్, పెట్రోల్, నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాషయ్య, నాయకులు శ్రీమన్నారాయణ, రాములు, రవీంద్ర, సత్తయ్య, హన్మంతు, రామారావు, నర్సింహ, సుందర్, జగన్, కృష్ణ తదితరులున్నారు.

వైద్య శిబిరంలో 500 మందికి పరీక్షలు

ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యుడు

తుర్కయాంజాల్, జనవరి 28 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కొహెడలో సౌమ్య దవాఖాన ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 500 మందికి సాధారణ వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌమ్య దవాఖాన యజమాని జగత్‌చంద్రయ్య పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, జయకిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

కరాటేలో ఆమనగల్లు విద్యార్థుల ప్రతిభ

బహుమతితో విద్యార్థులు

ఆమనగల్లు, జనవరి 28: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం వరల్డ్ నకాయమ షోటోకం కరాటే ఆధ్వర్యంలో నిర్వహించిన 2వ ఇంటర్నేషనల్ ఓపెన్ ఇన్విటేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో ఆమనగల్లు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను కరాటే మాస్టర్ జగదీశ్వర్ అభినందించారు.

గ్రామాల్లో బోనాల సందడి

ఎన్కేపల్లి గ్రామంలో పోచమ్మ బోనాల ఊరేగింపు

మొయినాబాద్, జనవరి 28 : ఎన్కేపల్లి గ్రామంలో పోచమ్మ బోనాల ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చందన, ఎంపీటీసీ రితీశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు చంద్రయ్య, అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ డప్పు ఆనంద్, నాయకులు భీమేందర్‌రెడ్డి, కుమ్మరి రాము, సుభాశ్, రమేశ్, రామచందర్, రాజేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమ్డాపూర్‌లో..

అమ్డాపూర్ గ్రామంలో మల్లికార్జునస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మల్లికార్జునస్వామి ఉత్సవాల్లో భాగంగా బోనాలను స్వామి వారికి సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవలిగోపీకృష్ణారెడ్డి, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఎన్ఆర్ కాలనీలో వైద్య శిబిరం

శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

పెద్దఅంబర్‌పేట, జనవరి 28: మున్సిపాలిటీ పరిధి రావినారాయణరెడ్డి కాలనీ ఫేజ్-3లో కామినేని హాస్పిటల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ, బీవోసీ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి, పలువురికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మణ్, ఏఐటీయూసీ నాయకులు అజ్మీరా హరిసింగ్‌నాయక్, దాసరి ప్రసాద్, పుల్లయ్య, నిరంజన్, సుధాకర్, యాదగిరి పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న లింగబలిజ సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం, జనవరి 28 : వీరశైవలింగాయత్, లింగబలిజ సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం ఆ సంఘం సెంట్రల్‌కమిటీ సభ్యుడు శెట్టి శివకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పట్నంశెట్టి విశ్వనాథ్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఆనందప్ప ఆధ్వర్యంలో 2024నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో లింగబలిజసంఘం నాయకులు అనిల్, రవి, శేకరప్ప, హరీశ్, శివ, అశోక్, మహేశ్, నగేశ్, మధు, శిరీశ్, కిశోర్, గిరి, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

శంకర్‌పల్లి జనవరి28: గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు, గోపులారం సర్పంచ్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గ్రామంలో బోరు తవ్వించి పైప్‌లైన్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలను పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రమేశ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు బైకు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

నందిగామ, జనవరి 28 : ఆర్టీసీ బస్సు, బైకు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన కొత్తూరు వై జంక్షన్ వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలం మణికియ్యమ్మగూడ గ్రామానికి చెందిన శంకరయ్య, బాలయ్య ఇద్దరు బైకుపై కొత్తూరు వై జంక్షన్ నుంచి తిమ్మాపూర్ వైపునకు వెళుతుండగా, హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు బైకును ఢీకొంది. దీంతో బైకుపై ఉన్న శంకరయ్య, బాలయ్య ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తూరు పోలీసులు తెలిపారు.

ఒత్తిడిని జయిస్తే.. విజయం మనదే..

- పరీక్షలనగానే భయపడొద్దు
- ఏకాగ్రతతో ఉండాలి... అన్ని పుస్తకాలు సమగ్రంగా చదవాలి
- ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలి
- ప్రణాళికాబద్ధంగా చదవడం అవసరం
- చక్కటి ఆహారం తగినంత నిద్ర తప్పనిసరి అంటున్న నిపుణులు

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 28 : పరీక్షలనగానే ఏదో భయం...వెంటాడే ఆందోళన.. అన్నీ చదవాలి.. కానీ ఏది ముందు చదవాలో తెలియని గందరగోళం.. ఇంట్లో అమ్మానాన్నలు ర్యాంకుల టార్గెట్.. ఫ్రెండ్స్ మధ్య పోటీ.. దీంతో పరీక్షల సమయం దగ్గరపడుతుంది.. మార్చి నెలలో పదోతరగతి, ఇంటర్ పరీక్షలు ప్రారంభం అవుతాయి.. పరీక్షలు దగ్గరపడుతున్నాకొద్దీ విద్యార్థులు ఆందోళనకు గురవుతుంటారు. చదివింది బుర్రకెక్కడంలేదని, లోలోపన మదనపడుతుంటారు. దీంతో ఫెయిల్ అవుతామనే భయం.. తక్కువ మార్కులు వస్తే అందరిలో తలెత్తుకోలేమన్న భావన.. తల్లిదండ్రులు తమపై పెంచుకున్న ఆశలు తీర్చగలమా..? అనే బెంగ.. పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ కంగారుతో కూడిన భయం తదితర కారణాల వల్ల విద్యార్థులలో మానసిక ఒత్తిడి పెరుగుతుంది.. ఒత్తిడిని తగ్గించుకుంటే ఏకాగ్రత సాధ్యమవుతుందని, దానిని అధిగమించడం ద్వారా విజయాన్ని సులువుగా సాధించొచ్చని నిపుణులు అంటున్నారు. ఇందుకు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, సందేహాలను నివృత్తి చేసే అధ్యాపకులు బాధ్యత తీసుకోవాలని చెబుతున్నారు. విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్న వేళ కొన్ని సలహాలు .. సూచనలపై ప్రత్యేక కథనం..

ఆత్మవిశ్వాసంతో ఒత్తిడికి చెక్..

మరికొద్ది రోజుల్లో పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పాఠశాలలు, కళాశాలల్లో ఇప్పటికే అన్ని సబ్జెక్టులకు సంబంధించిన సిలబస్ పూర్తి అయ్యింది. మార్కులు తక్కువ వస్తే తలెత్తుకోలేం. అని తరచూ గుర్తుకొస్తుంది. మరోవైపు పుస్తకం తెరిస్తే ఏదో ఒక ఆటంకం చదివింది బుర్రకెక్కకపోవడం.. నిమిషాలు, గంటలు వేగంగా ఉరుకుతూ ఉంటాయి. అదే సమయంలో ఒత్తిడి విద్యార్థి మనసుపైనా దాడిచేస్తుంది. ప్రతి విద్యార్థి తనపై తనకున్న విశ్వాసాన్ని గుర్తించాలి. అదే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి పరీక్షలు రాయాలి.

విద్యార్థులు ఆత్మపరిశీలన చేసుకోవాలి

ముందుగా ప్రతి విద్యార్థీ ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఇప్పటికే కొన్ని పరీక్షలకు హాజరై ఉంటారు. కాబట్టి ఆ పరీక్షలలో తమ పర్‌ఫార్మెన్స్ ఎలా ఉందో బేరీజు వేసుకోవాలి. ఎక్కడ మిస్టేక్స్ చేస్తున్నామనే విషయాన్ని ఎవరికి వారు గ్రహించుకోవాలి. ఏ పాఠ్యాంశాలలో ఎలాంటి పొరపాటు చేస్తున్నది పాయింట్ వారీగా నోట్‌చేసుకుని ఆయా పాఠ్యాంశాలలో అవసరమైనంత మేరకు అభ్యసించాలి. అందుకు ప్రత్యేక పద్ధతిని పాటిస్తూ ప్రణాళికలు వేసుకుని చదవాలి.

తల్లిదండ్రులు చేయాల్సినవి

ఏడాది పరీక్షలు, పలు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల విషయంలో తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకం.. ముఖ్యంగా ఈ సమయంలో ఇంట్లో ప్రశాంత వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు కృషిచేయాలి. వారిలో ఒత్తిడి తగ్గించేందుకు తమవంతు ప్రయత్నం చేయాలి. పిల్లల్లో మరింత ఒత్తిడిని పెంచే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలి. అంతేకాక పిల్లలు ఎక్కువ సమయం చదువుకే కేటాయిస్తారు. కాబట్టి వారి ఆరోగ్యం గురించి ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి. చదువుకునే సమయంలో మనస్సు ఎక్కువ శ్రమకు గురవుతుంది. కాబట్టి సమయానుకూలంగా తగిన ఆహారం అందించాలి. చాలినంత నిద్ర లేకపోతే ఆరోగ్యం దెబ్బతింటుందనే విషయాన్ని పరిగణిలోకి తీసుకుని తగినంత నిద్రపోయేలా చూడాలి.

ప్రణాళికా బద్ధంగా చదవాలి

పరీక్షలు ముంచుకొస్తున్న తరుణంలో ఎలాంటి ఆందోళనకు గురికావద్దు. తాము నేర్చుకోవాల్సిన అంశాలపై ప్రత్యేక దృష్టిని సారించాలి. ఇందుకోసం సమయాన్ని విభజించాలి. ప్రతిరోజూ ఉదయం 6గంటలు నిద్రకు ఉపక్రమించి మిగతా సమయాన్ని చదువుకు కేటాయించాలి. తెల్లవారుజామున 4గంటల నుంచి చదవడం ప్రారంభించాలి. చదువాల్సిన సబ్జెక్ట్‌ను విభాగాలు చేసుకుని చదవాలి. ముందుగా కఠినంగా ఉన్న సమాధానాలపై దృష్టి సారించాలి. గంటలపాటు అదే సబ్జెక్టును చదవాలి. కొంత సేపు విశ్రాంతి తీసుకుని కొంత సులభంగా ఉన్న సబ్జెక్టుపై దృష్టి సారించాలి. అర్థంకాని వాటిని ఉపాధ్యాయులు లేదా నిపుణులను అడిగి తెలుసుకోవాలి. చదివిన అంశాలను అవకాశం ఉంటే మిత్రులతో చర్చించాలి. ఒకటి, రెండు వ్యాక్యాలు సమాధానాలతో పాటు ఖాళీలను పూరించువంటి వాటి గుర్తించి ఎక్కువగా చర్చించాలి.

చదువు మధ్యలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పరీక్షల సమయంలో అదేపనిగా చదవడం వల్ల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. చదివే సమయంలో ప్రతి గంటకోసారి కాసేపు మెదడుకు విశ్రాంతి ఇవ్వడం మంచిది. దీనివల్ల చదివిన విషయాలు మరిచిపోకుండా ఉంటాయి. అంతేకాకుండా మనస్సుకు ఉత్తేజాన్ని కలిగించే మ్యూజిక్, పిల్లలతో కాసేపు కాలక్షేపం చేయడం మంచిది. ఉపాధ్యాయులు కూడా పరీక్షల సమయంలో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలి.

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం

పదోతరగతి విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. అలాగే, చదువులో వెనుకబడిన విద్యార్థులకు స్పెషల్ క్లాస్‌లు ఏర్పాటు చేసి వారు కూడా పరీక్షల్లో బాగా రాణించేందుకు కృషిచేస్తున్నాం. ముఖ్యంగా తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించి ఇల్లును ప్రశాంత వాతావరణంలో ఉంచి విద్యార్థులు చదువుకునే సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తల్లిదండ్రులు చూసుకోవాలి. విద్యార్థులు ఆందోళన చెందకుండా ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి.

– సుశేందర్‌రావు, డీఈవో

నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రీడలు దోహదం

మంచాల, జనవరి 28: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయని ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టు సభ్యులకు నగదుతో పాటు షీల్డ్‌ని ఆదివారం ఆయన అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కావలి శ్రీనివాస్, పున్నం రాము, మార సురేశ్, చంద్రయ్య, జానీపాషా, ఐలయ్య పాల్గొన్నారు.

విజేత జట్టుకు బహుమతిని అందజేస్తున్న సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మొయినాబాద్, జనవరి 28 : చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చిలుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ రాజేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి ఫీడర్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, చిన్నమంగళారం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుందని చెప్పారు. రెండు ఫీడర్ పరిధిలోని గ్రామాలైన రెడ్డిపల్లి, చందానగర్, మోత్కుపల్లి, చిన్నమంగళారం గ్రామాల పరిధిలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు, వ్యవసాయ క్షేత్రాలకు, విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆమనగల్లు : ఉదయం 9.30 నుంచి 12.30 వరకు 11 కేవీ జంగారెడ్డిపల్లి ఫీడర్, 11కేవీ అభిషేక్ కాటన్‌మిల్లు ఫీడర్, మధ్యాహ్నం 12.30 నుంచి 4.30 వరకు 11కేవీ మంగళపల్లి ఫీడర్, 11కేవీ సింగంపల్లి, చెన్నంపల్లి ఫీడర్ లైన్లలో ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించనున్నందున విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆదివారం ఏఈ సీతారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున జంగారెడ్డిపల్లి, సింగంపల్లి, చెన్నంపల్లి, రైతులు, ఇండస్ట్రీస్, వినియోగదారులు సహకరించాలని ఏఈ సీతారం కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం, జనవరి 28: కాలనీల్లో ఏర్పాటు చేసిన పార్కులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. హస్తినాపురం డివిజన్‌లోని హుడా భారతి కాలనీలో ఉన్న పార్కును కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులు ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని పంచుతాయన్నారు. ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలో పార్కులను అభివృద్ధి చేశామన్నారు. కాలనీలోని పార్కులో వ్యర్థాలు పడేస్తున్నట్లు కాలనీవాసులు ఫిర్యాదు చేశారన్నారు. దాంతో పాటు రాత్రి పూట ఆకతాయిలు మకాం వేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రహరి ఎత్తు తక్కువగా ఉన్నందన ఈ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రహరి సైజు పెంచడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. వాకర్స్ కోసం మట్టిని పోయించి ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహించాలని స్థానిక ఏసీపీని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.